# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మీ గంగా భవాని.

**గత సంచికలో ...**

మద్రాసు (నేటి చెన్నై, అలనాటి చెన్నపట్నం) చేరుకుని, బోర్డింగ్ పాసులు తీసుకుని, రూపాయలను డాలర్లకి ఎక్స్ఛేంజ్ చేసుకుని, కస్టమ్స్ క్లియరెన్స్ పూర్తి చేసుకుని బోర్డింగ్ కావడానికి సిద్ధమయ్యాము.

**శ్రీ గురుభ్యోనమ:**

## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

అక్కణ్ణించి పైన హాల్లోకి వెళ్ళడానికి మెట్లు, ప్రక్కన (ఎస్కలేటర్) నడవక్కర్లేకుండా వెళ్ళే బెల్టు వున్నాయి. అంతవరకు తిరుగుతున్న బెల్టు ఎందుకో ఆగింది. మేం మెట్లు ఎక్కి వెళ్ళాము. అక్కడ పెద్ద హాలు, ఎంట్రన్స్‌లో చేతి సూట్‌కేస్‌లు, బేగ్‌లు స్కేనింగ్ బెల్టు మీద పెట్టెయ్యమన్నారు. అవి అవతలివైపు హాల్లోకి వెళ్ళిపోయాయి. ఒక వైపు ఆడవాళ్ళని, ఇంకోవైపు మగవారిని, మెటల్ డిటెక్టర్ స్కేనింగ్) స్కేనింగ్ చేసి లోపలికి పంపించారు. లోపలికి వెళ్ళి ఎవరి హేండ్‌బేగ్‌లు, సూట్‌కేస్‌లు వాళ్ళు తీసుకున్నాము. హాల్లో పెద్ద పెద్ద కుషన్ సోఫాలు వున్నాయి. ఫ్రీ కాల్స్ చేసుకునే ఫోన్‌లు వున్నాయి. తాగడానికి కాఫీ వుంది. అంతవరకు అంతా సవ్యంగా జరిగి మేం ఫ్లైట్ ఎక్కడానికి సిద్ధంగా వున్నాం అని, మద్రాసులో మేం వున్న లాడ్జికి ఫోన్ చేసాము. కాఫీ తాగి ప్రశాంతిగా కాస్సేపు కూర్చుని, తరువాత ఏం చెయ్యాలని?, అంతకు ముందు మా వాళ్ళ ద్వారా పరిచయంకి పంపబడిన, వచ్చీరాని తెలుగు మాట్లాడే కేరళ అబ్బాయిల్ని అడిగాము. వాళ్ళు కూర్చోమని వెళ్ళేటప్పుడు చెప్తామని అన్నారు. ఇదంతా ఎనిమిదిన్నర నుండి పదిన్నర వరకు జరిగినది. పది గంటల నలభై నిమిషాలకి అందరూ లేచి హడావిడి పడుతుంటే, మేం కేరళ అబ్బాయిల వైపు చూసాము. వాళ్ళు రమ్మన్నట్లుగా అన్నారు. అందరితో కలిసి హాలులోంచి ఒక ద్వారం లోంచి సొరంగం లాంటి దారిలో 5 నిమిషాలు నడిచాము. ఇంకా ఆరుబైట స్థలానికి వెళ్ళి నిచ్చెన ఎక్కి ఫ్లైట్ లోకి వెళ్ళాలేమో! అనుకోవడం పూర్తి కానేలేదు. అందమైన అమ్మాయిలు ఒకే రకమైన డ్రస్సులు వేసుకున్నవారు చిరునవ్వులతో స్వాగతం పలికి, మాచేతిలో టిక్కెట్లు తీసుకుని సీటు నెంబర్లు చూసి కూర్చోపెట్టారు. అప్పటికిగాని మేం ఫ్లైట్‌లోకి డైరెక్ట్‌గా వచ్చామన్న విషయం అర్థం కాలేదు. మాచేతి సూట్‌కేస్, బేగ్ కూడా ఆ అమ్మాయిలే పైన కబ్బోర్డ్ లో పెట్టారు. నిమిషాలు కూడా తేడా లేకుండా నిర్ణయించిన సమయానికి రాత్రి 11:05 కి ఫ్లైట్ బయలుదేరింది. నడుంకి బెల్టు పెట్టుకోమని చెప్పారు.

అయిదు నిమిషాల్లో భూమిని వదిలి గాలిలోకి లేచింది. చిన్న కదలిక తప్ప ఇంకేం తేడాలేదు. వికారం కలగడం, వాంతులు అవడం లాంటివి ఏమీ జరగలేదు. ఎవరి సీటులో వారికి కప్పుకోవడానికి ఒక శాలువ లాంటిది ప్లాస్టిక్ కవర్లో పెట్టి వుంది. చిన్న తలగడా కూడా వుంది. ప్రతి సీటుకి ముందు సీటు మీద చూడ్డానికి అనుకూలంగా చిన్న టి.వి. వుంది. దానికి క్రింద కావలసినప్పుడు తియ్యడానికి, అవసరం లేకపోతే మూసెయ్యడానికి వీలుగా చిన్న డైనింగ్ టేబుల్ లాంటిది వుంది. ఎదురుగా చూసే టి.వి. కి సంబంధించిన రిమోట్ కంట్రోల్ స్విచ్ బోర్డ్, కూర్చున్న సీటుకి కుడి హేండిల్ వైపు బిగించి వుంది. అవసరం అయితే ఉపయోగించవచ్చు, లేకపోతే అడ్డం లేకుండా అందులోనే అమర్చెయ్యవచ్చు. టి.వి. లో అందరూ ఒకే ప్రోగ్రామ్ చూడవలసిన అవసరంలేదు. ఎవరికి ఇష్టం అయిన ఛానల్ వాళ్ళు పెట్టుకోవచ్చు. ఒక ఛానల్ లో ఫ్లైట్ ఎలా ప్రయాణం చేస్తోందో, ఎంత స్పీడులో వుందో, తగ్గుతుందో, హెచ్చుతుందో, రాబోయే స్టేజికి ఎంత సమయం పడుతుందో, ఎంత దూరం వుందో, అన్ని వివరాలు తెలియజేస్తుంది. కాళ్ళు పెట్టుకోడానికి ఎదురుసీటుకి చిన్న స్టేండ్ లాంటిది వుంది. ప్రయాణ సమయంలో కాళ్ళు చాపుకుని సీటు వెనక్కి వాలినట్టు విశ్రాంతిగా వున్నా, ఫ్లైట్ పైకి లేచినప్పుడు, క్రిందికి దిగినప్పుడు మాత్రం పాదాలు క్రింద మోపి సీట్లో నిటారుగా కూర్చోమనేవారు.

*ఇందులో వ్రాసిన కొన్ని విషయాలు మనం గమనించనే గమనించము. ఎంతో నిశితముగా పరిశీలిస్తే తప్ప ఇలా వ్రాయడం సాధ్యం కాదు. ముఖ్యముగా మొదటిసారి ప్రయాణములోనే ఇలాంటి అనుభూతి దొరుకుతుంది.*

మద్రాసు ఎయిర్ పోర్ట్‌కి వచ్చిన కొంతసేపటికి వర్షం మొదలైంది. ప్రయాణంలో కూడా చాలాసేపు వర్షం పడుతున్న ఆనవాళ్ళు కిటికీ అద్దం మీద తెలుస్తున్నాయి. దూరంగా మెఱుపులు కూడా కనిపించేవి. కొన్ని నిమిషాలపాటు నగరంలోని విద్యుత్ దీపాల కాంతులు కనిపించాయి. తరువాత అంతా అంధకారమే. మధ్యమధ్యలో, ఆరి వెలిగే, ఫ్లైట్ తాలూకు లైటు కాంతి తప్ప ఇంకేమీ కనిపించలేదు. ఒకేలాంటి డ్రస్సులు వేసుకున్న అందమైన అమ్మాయిలు తెల్లగా, సన్నగా, బంగారం బొమ్మల్లాగా, దేవకన్యలా? అన్నట్టు, మెఱుపు తీగల్లాగా, కనిపిస్తూ, తిరుగుతూ అందరూ సీట్లలో సర్దుకున్నాకా, ఒక ట్రేలో, అందంగా మడతపెట్టిన, ఆవిర్లు వస్తున్న, తెల్లని నేప్‌కిన్‌లు, అందరికీ ఇచ్చారు. అవి ఏం చెయ్యాలో మాకు తెలియక, అటు, ఇటు, వున్నవాళ్ళు ఏం చేస్తున్నారో! అని చూసాము. అందరూ వాటితో చేతులు, ముఖం, తుడుచుకున్నారు. మేము కూడా అలాగే చేసాము. రెండు నిమిషాల్లో మళ్ళీ అమ్మాయిలు వచ్చి, అందరిదగ్గర నేప్‌కిన్‌లు తీసుకున్నారు. కొంతసేపటికి చేతులు, ముఖం తడిమి చూసుకుంటే అతి సున్నితంగా, మెత్తగా వున్నాయి. తరువాత టి.వి. చూస్తూ వినడానికి యియర్ ఫోన్ సెట్టు ఇచ్చారు.

(మరికొన్ని విషయాలు వచ్చే సంక్రాంతి సంచికలో ...)